సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



లారీ టైర్ల కింద నలిగి..

సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తండ్రీకూతురు చక్రాల కింద నలిగిపోయారు.

8లో



మత్తు పదార్థాలకు..

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ నరహరి అన్నారు. ఈ మేరకు అవగాహన కల్పించారు.

8లో



ధరలు 'గణ'ం

గణనాథుడి విగ్రహాలకు ఈసారి రెక్కలొచ్చాయి. అదనపు హంగులకు అనుగుణంగా ధరలు పెంచారు.

8లో

చూస్తోంది ఏఐ



ఇట్టే పట్టేస్తోన్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్

- ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ యాప్‌తో గుట్టు రట్టు
- విధులకు డుమ్మా కొట్టి.. అడ్డంగా దొరికిన కార్యదర్శులు
- ఇప్పటికే ఎనిమిది మందిపై సస్పెన్షన్ వేటు
- మరో 15 మందికి షోకాజ్ నోటీసులు జారీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓ గ్రామ కార్యదర్శి సెలవు పెట్టకుండా ఆన్‌డ్యూటీలో పెళ్లి చూపులకు వెళ్లాడు. ఉదయం పెళ్లి చూపులు ముగించుకుని మధ్యాహ్నం ఆఫీసుకు చేరుకున్నాడు. ఆయన తన ఫోన్‌ను అటెండర్‌కు ఇచ్చి లొకేషన్ నుంచి యాప్‌లో హాజరు వేయించాల్సిందిగా సూచించాడు. అటెండర్ సదరు కార్యదర్శి ఫొటోకు బదులు తన ఫొటో లొకేషన్ నుంచి షేర్ చేశాడు. అప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 'ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ యాప్' గుర్తించింది. సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు చేరవేసింది. ఆరా తీయగా అసలు విషయం బయటికొచ్చింది. దీంతో సదరు కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇలా విధులకు డుమ్మా కొడుతూ ఒకరికి బదులుగా మరొకరితో ఫేక్ అటెండెన్స్ వేయించుకుంటున్న కార్యదర్శుల తీరుపై జిల్లా పంచాయతీ విభాగం సీరియస్ అయింది. ఇప్పటికే ఆమనగల్లు మండలం సింగంపల్లి కార్యదర్శి సహా ఫరూఖ్‌నగర్ మండలం బీమారం కార్యదర్శులపై ఇదే అంశంలో సస్పెండ్ చేసింది. వీరితో పాటు మరో ఐదుగురిపై చర్యలు తీసుకుంది.

ఫేక్ అటెండెన్స్‌కు స్వస్తి చెప్పేందుకే..

జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీలు ఉండగా, 318 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 73 మంది ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు పని చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధిలో వీరే కీలకం .ఇంటి నిర్మాణ అనుమతులు, పన్నుల వసూళ్లు సహా పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల పర్యవేక్షణ వంటివి చూసుకోవాల్సి ఉంది. మెజార్టీ కార్యదర్శులు గ్రామాలకు వెళ్లకుండానే వెళ్లినట్లు తప్పుడు హాజరు న మోదు చేయిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి బాగోగులు చూసుకోవాల్సిన కార్యదర్శులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ ఫేక్ అటెండెన్స్ విధానానికి స్వస్తి పలకాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం బయోమెట్రిక్ ఐరీస్ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. పంచాయతీ కార్యదర్శుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో తాత్కాలికంగా దాన్ని నిలిపివేసింది. ప్రత్యామ్నాయంగా ఎనిమిది నెలల క్రితం 'ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్'విధానాన్ని ప్రవేశపెట్టింది. కార్యదర్శులు ప్రతి రోజూ ఉదయం పది గంటలకు విధులు నిర్వర్తించే పంచాయతీ లొకేషన్‌కు చేరుకుని ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ యాప్ ద్వారా ఫొటో తీసి పంచాయతీ యాప్‌లో వేసి హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది.

అవగాహన లేకే..

ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ యాప్‌పై మెజార్టీ కార్యదర్శులకు అవగాహన లేదు. తెలియక కొంత మంది తప్పు చేస్తే..తెలిసి మరికొంత మంది తప్పు చేసి దొరికిపోతున్నారు. ఇప్పటికే ఎనిమిది మందిపై సస్పెన్షన్ వేటు పడింది. మరో పదిహేను మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. విధి నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఇట్టే దొరికిపోయే అవకాశం ఉంది. అంతేకాదు ఫిర్యాదులకు స్పందించకుండా, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కార్యదర్శులపై కూడా నిఘా కొనసాగుతోంది.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

భూములు ఇచ్చేది లేదు

- తేల్చిచెప్పిన రైతులు
- తిమ్మాపూర్‌లో భూ సేకరణపై గ్రామసభ

కందుకూరు:మండలంలోని తిమ్మాపూర్ రెవెన్యూలో అసైన్డ్ భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. సర్వే నంబర్లు 38, 162లోని 566.39 ఎకరాల అసైన్డ్ భూములను టీజీఐఐసీద్వారా పారిశ్రామిక పార్కుకు సేకరించడానికి గతంలో నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా సోమవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం ఎకరాకు మూడు రెట్లు అంటే రూ.59.40 లక్షల మేర పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. భూములను ప్రభుత్వానికి ఇచ్చి సహకరించాలని కోరారు. రైతులు మాత్రం ఎన్నో ఏళ్లుగా ఆ భూములనే నమ్ముకుని జీవిస్తున్నామని, ప్రభుత్వానికి ఇస్తే ఉపాధి కోల్పోతామని ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. 20 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను పట్టాగా చేస్తామని గతంలో అధికార పార్టీ ప్రకటించిందని, ఆవిధంగా మార్చాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వారికి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, సీఐ సీతారామ్, నాయబ్ తహసీల్దార్ రాజు, ఆర్ఐ యాదగిరి, టీజీఐఐసీ మేనేజర్ అజీజసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యుత్ శాఖలో అవినీతిపై అధికారుల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్:విద్యుత్ శాఖలో అవినీతి దందాపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. సోమవారం 'సాక్షి'లో 'కనెక్షన్.. కలెక్షన్' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. విజిలెన్స్, ఇంటలిజెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమాలపై ఆరా తీశారు. మొయినాబాద్‌లో పర్యటించిన అధికారులు బాధితులను కలిసి విషయాలను తెలుసుకున్నారు. కొత్త కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు, సిబ్బంది ఏ విధంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.. ఎవరి ద్వారా తీసుకుంటున్నారనే విషయాలను రాబట్టినట్లు సమాచారం. విచారణలో వెలుగుచూసిన అంశాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

చిలుకూరు సన్నిధిలో రాజవంశ సభ్యురాలు



వాక్ పుస్తకాన్ని చూస్తున్న పద్మశ్రీ అశ్వతి తిరునాల్ గౌరి లక్ష్మీబాయి

మొయినాబాద్: తిరువనంతపురం రాజవంశ సభ్యురాలు, చారిత్రక రచయిత్రి, ప్రసిద్ధ కవి పద్మశ్రీ అశ్వతి తిరునాల్ గౌరి లక్ష్మీబాయి చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ వారికి వాక్ పుస్తకాన్ని అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. లక్ష్మీబాయి చిలుకూరు బాలాజీ ఆలయ అర్చక ట్రస్టీ కుటుంబానికి, తిరువనంతపురం పద్మనాభదాస రాజవంశానికి మధ్య ఉన్న ఆధ్యాత్మిక బంధాన్ని మరోసారి గుర్తు చేశారని ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. తిరువనంతపురం చరిత్ర, పద్మనాభ స్వామి దేవాలయంపై ఆమె చేసిన రచనలు విశేష ఆదరణ పొందాయని చెప్పారు.

మైసిగండిని దర్శించుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే



అమ్మవారికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలు తెలపడానికి వచ్చిన వారి నుంచి అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్ ఓ సంగీత ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ..శాఖల వారీగా స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ వారం మొత్తం 74 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇతర శాఖలకు సంబంధించి 36 వచ్చాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జేఏసీ కన్వీనర్ రామారావు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ కె.రామారావు అన్నారు. పెన్షనర్ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినాన్ని పాటించాలని, ఉదయం 11 గంటలకు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టాలన్నారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. సెప్టెంబర్ 15న ఉమ్మడి జిల్లాలో జరిగే జేఏసీ బస్సు యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి కార్యాచరణ నోటీసు అందజేశారు. పెన్షన్ విద్రోహదినం, హైదరాబాద్ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనేష్‌కుమార్‌నోరీ, యశ్వంత్, వెంకటేశ్, నూతనకంటివెంకట్,శాంతిశ్రీ,రంగయ్య, అనిత,మహేశ్,ఈశ్వర్,బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును తరలించొద్దు

- సీపీఎం, బీజేపీ నేతల ఆందోళనలు

ఇబ్రహీంపట్నం: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దంటూ సీపీఎం, బీజేపీ సోమవారం వేర్వేరుగా ఆందోళనబాట పట్టాయి. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల నుంచి వృద్ధులు, మహిళలు దూర ప్రాంతానికి రిజిస్ట్రేషన్లకు వెళ్లాల్సివస్తే ఇబ్బందులు పడతారన్నారు. ఇబ్రహీంపట్నం ఎస్ఆర్వో కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించే యోచనను విరమించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుగ్గరాములు, జగన్, ఎల్లేష్, వీరేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై బీజేపీ రాస్తారోకో

ఎస్ఆర్వో కార్యాలయాన్ని తరలించొద్దని బీజేపీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మాజీ కౌన్సిలర్లు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించడం భావ్యం కాదన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద శాశ్వత భవన నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయిందని, నిర్మాణాన్ని పూర్తి చేసి అందులోకి మార్చాలని కోరారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్, కిషాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా

ప్రజావాణిలో వినతులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దని సోమవారం నిర్వహించిన డివిజన్ ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. రియల్ వ్యాపారులు, స్థానికులు తహసీల్దార్ సునీతకు వినతిపత్రాలు అందజేశారు.

గణేశ్ ఉత్సవాలకు డీజే అనుమతి లేదు



ఆదిబట్ల ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు డీజేలకు అనుమతి లేదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకొనేలా చూడాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరి ఆన్‌లైన్ అనుమతులు తీసుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి మండపం వద్దకు వెళ్లి పరిశీలించాలన్నారు. ప్రభుత్వం మండపాలకు ఉచిత విద్యుత్ అందజేస్తోందని తెలిపారు. విద్యుత్, అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా మసలు కోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతి గురించి సీఐని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తుర్కయంజాల్: వినాయకుడి నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ (స్థానిక సంస్థలు) అన్నారు. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ చెన్న కేశవ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ రాములు, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. పారిశుద్ధ్య పనులను 24 గంటల పాటు కొనసాగించాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. గతంతో పోల్చితే ఈసారి ఇక్కడికి నిమజ్జనానికి వచ్చే విగ్రహాల సంఖ్య 25 శాతం కంటే రెట్టింపుకానుందన్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నోయల్ రాజు, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

బాలాపూర్ గణేశుడి దర్శనానికి రండి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుడి దర్శనానికి రావాలని ఉత్సవ సమితి నిర్వాహకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. సీఎంను కలిసినవారిలో కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత, ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేత్రోనీలనంతో మహాశక్తి గణపతికి ప్రాణ ప్రతిష్ఠ



ఖైరతాబాద్: శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి విగ్రహానికి సోమవారం ఉదయం 10.30 గంటలకు కంటి పాపను అమర్చి శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ ప్రాణ ప్రతిష్ఠ చేశారు. విగ్రహాన్ని పూర్తిగా మట్టితోనే చేశామని, ఈసారి మహాగణపతిని దర్శించుకునే భక్తులకు అన్ని విఘ్నాలు తొలగిపోవడంతో పాటు విశ్వశాంతి నెలకొనేందుకే విశ్వశాంతి మహా గణపతిగా నామకరణం చేసినట్లు విఠల్ శర్మ సిద్ధాంతి తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతికి సాయంత్రం ఆగమన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేకంగా మరాఠా బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

పారితోషికం తగ్గిస్తే ఊరుకోం



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

- ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత

ఇబ్రహీంపట్నంరూరల్: ఆశ వర్కర్లు పని చేయడం లేదని, వారికిచ్చే పారితోషికంలో కోత పెట్టాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రం పెంచిన పారితోషికాలను రాష్ట్ర ప్రభుత్వం యథావిధిగా అమలు చేయాలని అన్నారు. రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్‌సీ, ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీల ప్రకారం ఇన్సూరెన్స్ రూ.50 వేలు చెల్లిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఆదివారం, పండుగలకు సెలవు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక గదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుద్రకుమార్, కార్యదర్శి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం తగదు

- అరెస్టులు, కేసులకు భయపడం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

అబ్దుల్లాపూర్‌మెట్: న్యాయం కోసం పోరాడుతున్న రైతులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మండిపడ్డారు. అరెస్టులు, కేసులకు ఎర్రజెండా భయపడదన్నారు. అనాజ్‌పూర్ సర్వే నంబర్ 274,75, 76,77,78,81 లోని సీలింగ్ భూముల్లో రైతులకు 125 ఎకరాలకు సంబంధించి పట్టాపాసు పుస్తకాలు జారీచేయడంతో పాటు, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం అనాజ్‌పూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నిరసనలో జాన్‌వెస్లీతో పాటు ఆ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, పహాడీషరీఫ్ ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు శివకుమార్, ముత్యాలు, సుమలత, లింగస్వామి, బాలరాజు, యాదయ్య, భిక్షపతి, జంగయ్య, రాములు, మహేశ్, రవి, రైతులు పాల్గొన్నారు.



జాన్‌వెస్లీని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం శంకర్‌పల్లి మండలంలో చోటు చేసుకుంది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం ఎట్లఎర్రవల్లికి చెందిన కుంటి ప్రశాంత్(25)కు నాలుగేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం గోపులాపురానికి చెందిన మహేశ్వరితో వివాహం జరిగింది. ఇల్లరికం వచ్చిన ప్రశాంత్ స్థానికంగా ఓ మెడికల్ షాపులో పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇదిలా ఉండగా తమ కొడుకు మృతిపై అనుమానం ఉందని ప్రశాంత్ తల్లి ఆరోపించింది. మృతుడి భార్య, అత్త, వదిన (భార్య సోదరి)పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. మణిదీప్(11) అనే బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఇదే గ్రామానికి చెందిన ఓ బాలుడు కుక్కల దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు.

లారీ టైర్ల కింద నలిగి తండ్రీకూతురు దుర్మరణం

- వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టిన సిమెంట్ ట్యాంకర్
- హాస్టల్ నుంచి కూతురును ఇంటికి తీసుకెళ్తుండగా చేవెళ్ల వద్ద ఘటన
- బీరెల్లిలో విషాదఛాయలు


కృప (ఫైల్)


రవీందర్ (ఫైల్)


లారీ చక్రాల కింద రవీందర్


ప్రమాద స్థలంలో కృప

చేవెళ్ల: సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తండ్రీకూతురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ప్రకారం.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర రవీందర్(32) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ఏఎన్‌ఎంగా పని చేసే భార్య రత్నమ్మ, కూతురు కృప(13), కొడుకు ఉన్నారు. మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట వద్ద కొనసాగుతున్న బంట్వారం ఎస్సీ గురుకుల పాఠశాలలో కృప 7వ తరగతి చదువుతోంది. కూతురుకు జ్వరం వచ్చిందని తెలియడంతో చూసివెళ్లేందుకు రవీందర్ హాస్టల్‌కు వచ్చాడు. బుధవారం వినాయక చవితి కూడా ఉండటంతో అనుమతి తీసుకుని కూతురుతో పాటు ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో చేవెళ్ల వద్ద వెనక నుంచి వచ్చిన సిమెంట్ ట్యాంకర్ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి కింద పడ్డారు. లారీ డ్రైవర్ వాహనాన్ని అలాగే ముందుకు తీసుకెళ్లడంతో చక్రాల కింద నలిగిపోయారు. వెనక టైర్ల కింద పడిపోయిన రవీందర్‌ను చూసి, అక్కడే ఉన్న స్థానికులు పెద్దగా అరిచారు. దీంతో డ్రైవర్ లారీని వెనక్కి తీయడంతో రవీందర్ మృతదేహం చక్రాల పైనున్న ఇనుప రేకుల మధ్య ఇరుక్కుపోయింది. ప్రమాదంలో తండ్రీకూతురు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రవీందర్, కృప మృతితో బీరెల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన చేవెళ్లకు బయలుదేరారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు ఛాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సీఐ నరహరి



మాట్లాడుతున్న సీఐ నరహరి

కేశంపేట: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ నరహరి అన్నారు. ఇంటర్ స్టూడెంట్, పదో తరగతి విద్యార్థులతో కలిసి హాస్టల్‌లో రాత్రి వేళ హుక్కా సేవించడంపై ఆదివారం 'హాస్టల్‌లో హుక్కా' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నతంగా రాణించాలని సూచించారు. చదువు ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, మండల విద్యాధికారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, కళాశాల లెక్చరర్లు నారాయణ, లక్ష్మీరాజ్, మల్లేశ్, భరత్, ధృవకుమార్, అస్మా, రాణి, ఆసిఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



యూరియా కోసం అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. సహకార సంఘాల వద్ద పడిగాపులు పడుతున్నారు. షాబాద్‌లోని పీఏసీఎస్ వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ఒక్కసారిగా ఎగబడ్డారు. చాలా మందికి దొరకకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. – షాబాద్

న్యాయం చేయాలంటూ ఆందోళన

ప్రజావాణిలో సోలీపూర్ భూ బాధితుల బైఠాయింపు

షాద్‌నగర్‌రూరల్: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ భూ బాధితులు ఆందోళనకు దిగారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు మారుతున్నా తమకు న్యాయం జరగడం లేదని ప్రజావాణిలో బైఠాయించారు. బాధితుల వివరాలిలా.. మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ శివారులో గల 22/లు సర్వే నంబర్‌లో ఉన్న 12 ఎకరాల భూమికి ఫరూఖ్‌నగర్‌కు చెందిన ఉమర్‌బిన్ సయ్యద్ పట్టాదారుడు. అదే గ్రామానికి చెందిన పద్మజంగయ్య, పద్మచంద్రయ్యకు 1988లో ఉమర్‌బిన్ సయ్యద్ 12ఎకరాలను గిఫ్ట్ డీడ్ ఇచ్చాడు. అప్పటి నుంచి గిఫ్ట్ డీడ్ పొందినవారికి పట్టా పాస్‌బుక్స్ రావడంతో వారే కబ్జాలో ఉన్నారు. ఆ తర్వాత కుటుంబ జీవనం ఇబ్బందిగా మారడంతో పద్మజంగయ్య, పద్మచంద్రయ్య వారసులు పండ్లు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయకున్నా కొంతకాలం తరువాత నూర్ కాలేజ్ వారు ఈ భూమి మాదంటూ కబ్జాలోకి వచ్చారు. ఈ భూ వివాదంపై 2002లో పట్టాదారులు ఆర్డీఓలో కేసు వేశారు. 2018లో అప్పటి జిల్లా కలెక్టర్ హరీశ్ పట్టాదారులకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చారు. ఆ తరువాత జిల్లా అధికారులు రిజర్వ్‌డ్ ఫర్ ఆర్డర్ ఇచ్చారని, దీంతో తహసీల్దారు ఆదేశాలతో రెవెన్యూ అధికారి పంచనామా నిర్వహించి ఈ భూమి మాదేనని రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. నూర్ కాలేజ్‌వారు భూమికి సంబంధించిన ఎలాంటి దస్తావేజులను చూపలేదని, 2021లో వారు అక్రమంగా సుప్రీం బిల్డర్ వారిపై దొంగ రిజిస్ట్రేషన్‌తో పాటు నాలా కన్వర్షన్ చేశారని బాధిత రైతులు ఆరోపించారు. మాకు సెతస్కో ఆర్డర్ వచ్చినప్పటికీ.. కొందరు దానిని పట్టించుకోకుండా మా భూమిలోకి వచ్చిగోడ నిర్మాణం చేపట్టడం, జేసీబీలతో భూమిని తవ్వడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఆర్డర్ కాపీలను, నోటీసులను పట్టించుకోకుండా మా భూమిలో సుప్రీం బిల్డర్ వాళ్లు యథేచ్ఛగా పనులను చేపడుతున్నారన్నారు. భూమిపైకి వస్తే మమ్మల్ని చంపుతామని సుప్రీం బిల్డర్ వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత 20 సంవత్సరాలుగా భూమికోసం పోరాడుతున్నామని, నేటివరకు మాకు న్యాయం జరగలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి న్యాయం చేయాలని భూ బాధితులు కోరుతున్నారు.

స్క్రాప్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కుషాయిగూడ: ఓ స్క్రాప్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయికృష్ణనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జమ్మిగడ్డకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి గత కొంత కాలంగా ఖాళీ స్థలాన్ని లీజుకు తీసుకుని స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్క్రాప్ గోడౌన్‌లో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీనిపై సమాచారం అందడంతో కుషాయిగూడ పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. ఆరు గంటల పాటు శ్రమించి సోమవారం తెల్లవారుజామున మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రాథమిక సమాచారం మేరకు 30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తండ్రిని చంపిన కొడుకుకు రిమాండ్


నిందితుడు అజీమ్‌ఖాన్

మొయినాబాద్: మద్యం తాగి పనికి వెళ్లకుండా గొడవలు పెడుతున్నాడనే కారణంతో తండ్రిని కొట్టి చంపిన కొడుకును రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ముర్తూజగూడకు చెందిన మహ్మద్ అజ్జుఖాన్(50) కూలీ పనులుచేసేవాడు. ఈనెల 6న ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, తన వద్ద డబ్బులు తీసుకుని పనికి ఎందుకు రాలేదని అజ్జుఖాన్‌ను అడిగాడు. ఇదే విషయమై అజ్జుఖాన్ భార్య సైతం నిలదీస్తుండగా అక్కడికి వచ్చిన కొడుకు మహ్మద్ అజీమ్‌ఖాన్ తండ్రిపై కోపోద్రిక్తుడయ్యాడు. మద్యం తాగి పనికి వెళ్లకుండా గొడవ పెడుతున్నావంటూ కర్ర తీసుకుని తలపై బాదడంతో అజ్జుఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు సోమవారం నిందితుడు అజీమ్‌ఖాన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.


చెరువులో పడి బాలుడి మృతి

- నాదర్‌గుల్ సున్నం చెరువులో ఘటన
- మృతదేహాన్ని వెలికి తీసిన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది


ఉమైర్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: సైకిల్‌తో ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి, మతిస్థిమితం లేని బాలుడు మృతి చెందిన సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. బడంగ్‌పేట్ మున్సిపాలిటీ నాదర్‌గుల్‌లోని అశోక్‌రెడ్డి కాలనీలో నివాసం ఉండే మహ్మద్ అజ్మత్‌అలీ, అయేషాల దంపతులకు ముగ్గురు పిల్లలు. వీరిలో ఇద్దరు అమ్మాయిలు కాగా, చిన్నవాడు ఉమైర్(6) మానసిక పరిస్థితి బాగోలేదు. దీంతో తల్లితో పాటు ఇంట్లో ఉండేవాడు. రోజు ఆడుకోవడానికి బయటకు వెళ్తుంటాడు. అతన్ని గమనిస్తూ తల్లి ఇంటి పనులు చేసుకునేది. సాయంత్రం ఇంట్లో ఉన్న చిన్న సైకిల్ తీసుకుని బాలుడు బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఉమైర్ కోసం వెతకగా కనిపించలేదు. కాలనీలోని చిన్నారులను అడగగా సైకిల్ తీసుకుని చెరువు కట్ట వైపు వెళ్లాడని చెప్పారు. అక్కడికి వెళ్లి వెతుకుతుండగా కట్టపై సైకిల్ కనిపించింది. కంగారు పడిన తల్లి పోలీసులకు సమాచారం అందించింది. అగ్నిమాపక సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు చెరువులో వెతకగా ఉమైర్ మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం బాడీని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

గృహిణి అదృశ్యం


జయంతి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన చక్రధర్ ఐదేళ్ల క్రితం తన భార్య జయంతి(26)తో కలిసి జీవనోపాధి నిమిత్తం జల్‌పల్లిలోని శ్రీరాం కాలనీకి వలస వచ్చాడు. ఈ నెల 22న ఒడిశాకు వెళ్తానని చెప్పిన జయంతి పుట్టింటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా లాభం లేకపోవడంతో భర్త ఆదివారం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాన్ బ్రోకర్‌పై కేసు నమోదు

ఫిలింనగర్: తాకట్టు పెట్టిన బంగారు నగలతో పాటు వడ్డీకి తీసుకున్న డబ్బులతో పరారైన పాన్‌బ్రోకర్‌పై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్, గౌతంనగర్ బస్తీలో రాజస్థాన్‌కు చెందిన మాణిక్‌చౌదరి అనే పాన్ బ్రోకర్ నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. స్థానికులు చాలామంది అతడి వద్ద ఆభరణాలు తాకట్టుపెట్టి అప్పు తీసుకున్నారు. ఇటీవల షాపు ఎత్తేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బసవతారకనగర్ బస్తీకి చెందిన జనార్దన్‌రెడ్డి అనే వ్యక్తి ఐదు తులాల బంగారం తాకట్టు పెట్టి అప్పు తీసుకుని ఆగస్టు 4న రూ.2.55 లక్షలు చెల్లించాడు. ఈ నెల 18న బంగారం తిరిగి ఇస్తానని చెప్పిన మాణిక్‌చౌదరి బోర్డు తిప్పేయడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అపోలో ఆస్పత్రి బాలాజీ టెంపుల్‌లో పూజారిగా పనిచేస్తున్న ఆరుట్ల వెంకటరమణ రూ.18 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఫిలింనగర్ పోలీసులు నిందితుడు మాణిచౌదరిపై కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఫిలింనగర్‌లో పలువురిని నమ్మించి రూ. లక్షలు వసూలు చేయడమే కాకుండా పలువురు రాజకీయ నాయకుల వద్ద కూడా డబ్బులు తీసుకుని మోసం చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. సుమారు రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

ధరలు 'గణ'ం



ఈసారి 20 శాతానికిపైగా పెరిగిన వినాయక విగ్రహాల రేట్లు

మండపాలు, నిర్వహణ ఖర్చులూ అధికమే
- 20 అడుగుల విగ్రహం రూ.లక్షకుపైగానే
- అయినా జోరు తగ్గని విక్రయాలు
- ధూల్‌పేట్, నాగోలు, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో సందడి

సాక్షి, సిటీబ్యూరో: భక్తకోటి ఇష్టదైవం బొజ్జ గణపయ్య వేడుకల కోసం నగరం సిద్ధమవుతోంది. మండపాల అలంకరణ, విగ్రహాల కొనుగోళ్లు, పూజా సామగ్రి విక్రయాలతో సందడి నెలకొంది. ఈసారి గణనాథుడి విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. గత ఏడాది కంటే 20 శాతానికి పైగా ధరలు పెరిగినప్పటికీ అమ్మకాలు జోరుగానే సాగుతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మండపాల నిర్వాహకులు, కాలనీలు, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు పెద్ద ఎత్తున విగ్రహాలను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ధూల్‌పేట్, నాగోల్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, మియాపూర్ తదితర ప్రాంతాల్లో విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. 20 ఫీట్ల ఎత్తు ఉన్న విగ్రహాలు గత సంవత్సరం రూ.85 వేల వరకు విక్రయించగా, ఈసారి రూ.లక్ష దాటింది. ఎక్కువ మంది కొనుగోలు చేసే 12 ఫీట్లు, 16 ఫీట్ల విగ్రహాల ధరలు కూడా బాగా పెరిగాయి. గత సంవత్సరం రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు లభించిన విగ్రహాల ధరలు ఇప్పుడు రూ.70 వేల నుంచి రూ.80 వేలు దాటాయి. విగ్రహాలకు అదనపు అలంకరణలు, హంగూ ఆర్భాటాలకు అనుగుణంగా ధరలను పెంచారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర ముడిపదార్థాలు, రవాణా తదితర ఖర్చులు భారీగా పెరగడంతో విగ్రహాల ధరలను కొంత మేరకు పెంచాల్సి వచ్చినట్లు ధూల్‌పేట్‌కు చెందిన బబ్బూసింగ్ తెలిపారు. ధూల్‌పేట్‌లోనే తయారు చేసిన 12 జ్యోతిర్లింగాల మహాకాళ వినాయక విగ్రహాన్ని రూ.2 లక్షల వరకు విక్రయించారు.

దారులన్నీ ధూల్‌పేట్‌వైపే..


తెలంగాణలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోనూ ధూల్‌పేట వినాయక విగ్రహాలకు ఎంతో ఆదరణ ఉంది. దీంతో అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. 5 ఫీట్ల నుంచి 30 ఫీట్ల భారీ విగ్రహాల వరకు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మరోవైపు 12 ఇంచులు, 6 ఇంచుల విగ్రహాలు కూడా విక్రయిస్తున్నట్లు రాకేష్ సింగ్ తెలిపారు. 20 నుంచి 30 అడుగుల వరకు ఉన్న విగ్రహాలు, వాటి ఆకృతులు, డిజైన్‌లు, వినియోగించిన రంగులు, ఫైబర్, తదితరాల ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు ధరలు ఉన్నాయి. ధూల్‌పేట్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వైవిధ్యభరితమైన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినాయక విగ్రహాలతో పాటు దుర్గామాత ఉత్సవాలకు అనుగుణంగా విగ్రహాలను తయారు చేసే ధూల్‌పేట దక్షిణాది రాష్ట్రాలకే ప్రధాన మార్కెట్‌గా ఉంది. కానీ కొంతకాలంగా ఇతర రాష్ట్రాల నుంచి కూడా విగ్రహాలను హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో పోటీ బాగా పెరిగిందని ధూల్‌పేటకు చెందిన రాజేశ్వరి తెలిపారు.



నిర్వహణ కూడా భారీగానే..

అపార్ట్‌మెంట్‌లు, కాలనీ అసోసియేషన్‌లు, యువజన సంఘాలు, భక్తసమాజాలు నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధమవుతున్నాయి. బుధవారం నుంచి ప్రారంభం కానున్న గణనాథుడి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గ్రేటర్‌లో సుమారు 4 వేలకు పైగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు ఉన్నట్లు అంచనా. ఖైరతాబాద్, బాలాపూర్ సహా ప్రధాన మండపాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాలు భారీ మండపాలను ఏర్పాటు చేస్తున్నాయి. విగ్రహాలతో పాటు ఏర్పాట్లు, నిర్వహణ ఖర్చులు సైతం భారీగానే పెరుగుతున్నాయని నిజాంపేట్‌కు చెందిన ఓ అపార్ట్‌మెంట్ కార్యదర్శి తెలిపారు.

ధరల పెంపు స్వల్పమే



పెరిగిన ముడిసరుకుల ధరలు, రవాణా ఖర్చులతో విగ్రహాల ధరలను స్వల్పంగా పెంచాల్సి వచ్చింది. గిరాకీ ఉన్నా లేకున్నా ప్రతి సంవత్సరం విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తూనే ఉన్నాం. ఒకసారి లాభాలు బాగా రావచ్చు. మరోసారి రాకపోవచ్చు. వ్యాపారాన్ని వదులుకోలేం కదా.
– గణేశ్‌సింగ్, ధూల్‌పేట్